# అణుశక్తి

పోతరాజులు కండలు పెంచేది అందుకోసమే కదా! - అంత తిండి, తాగుడు, ఆ జల్సాలు, ఖరీదైన బంగళాలు, వాహనాలు వాళ్ళకు ఎక్కణ్నుంచి వొస్తాయి?... నాయకుల వేళ్ల సందునుంచి...!

“మన వూళ్లో ఇగ పోతరాజు అడుగు పెట్టడట...” తెల్ల గడ్డం యాకూబు, చెంద్రయ్యతో, అన్నాడు.

నిజమా! అన్నట్లు చూశాడు చెంద్రయ్య.

“అవ్ సెంద్రన్నా! అమీన్ సాబ్ ఇద్దరు పోలీసోళ్లను పంపిండు గదా...”

బీడి పెదాల మధ్య పెట్టుకోని అగ్గిపెట్టె కోసం లాల్చీజేబు తడుముకున్నాడు యాకూబు. - అగ్గిపెట్టె అందింది.

అగ్గిపుల్ల వెలిగించి బీడి అంటించుకున్నాడు.

చెంద్రయ్యకు కూడా ఓ బీడి అందించాడు.

“బంద్ చేసిన గదన్నా - శానారోజులాయె...” అన్నాడు చెంద్రయ్య.

“బీడి తాగుడు బీ బంద్ చేసినవ్! కల్లు సార బంద్ చేసిన అంటివి”

“ఆ - అన్ని బంద్ చేసిన - డాక్సరి వొద్దనె గదా”

“అట్లనా...”

“అవ్ - గయన్నీ బంద్ చేసిన కాన్నించి జెర పానం బాగయింది - ఇంట్ల గూడ జెర పైసలాడ్తానయి....”

మౌనంగా వింటున్నాడు యాకూబు.

"అయితే - అమీను మానూరికి ఇద్దరు పోలీసోళ్లను పంపినాడు?" నమ్మశక్యం కాక మళ్లీ అడిగాడు చెంద్రయ్య -

"ఆ... శేరాలు ఓటల్ కాడ కూసున్నరు గద - నువ్వు చూళ్లే?"

"లే - గట్నుంచి రాలే - గడికాంచి వొచ్చిన-"

"గడి కాడ ఏవన్న అనుకుంటాండ్ల?"

"ఆఁ అనుకుంటాండ్లు.... ఈరసొంగాడు అమీన్ కచ్చిర్లకు పోయి పోతరాజుగాని మీద రిపోట్ ఇచ్చిండు గదా - అమీనుగ్గాడ పోతరాజు గాడంటె బయమేనాయె - గాయినేం జేస్తడు - ఇగ పోతరాజు వూరిమీద పడి దొమ్మి దొమ్మి చేసి పోతడు అనుకుంటాండ్లు..."

"రోజు రోజుకు గా పోతరాజుగాని జులం పెరుగుతాండె - పైసలు గుంజుక పోబట్టిరి - ఆడపోరల మానం తీయబట్టిరి...

ఎవ్వడో ఒకడు గావానిమీద కచ్చీర్ల రిపోట్ చేయకపోతే ఎట్లా? ఈరసొంగాడు ధైర్నం చేసి గాపనిచేసిండు... వూరి మంచికీ చేసిండా? సెడ్డకు చేసిండా?..."

"మంచికే చేసిండు - అయితే అమీను ఇద్దరు పోలీసోళ్లను పంపినాడు!"

"ఆ... శేరాలు ఓటల్కాడ బేంచి మీన కూసాని వుడుకుడుకు చా తాగుతాండ్లు."

అని యాకూబు చెబుతుండగానే ఇద్దరు పోలీసులు అటువైపు పరుగెత్తుకుంటూ వచ్చారు -

వాళ్లను గెదుముతూ వెనక పోతరాజు, వాడి రౌడీ మూకవచ్చింది!

వాళ్లు మొత్తం అయిదుగురు!

పోలీసులు ఇద్దరే!

వాళ్లు అయిదుగురు ఐదు పర్వతాల్లా గున్నారు. వాళ్లు అయిదుగురు ఐదుకొండ చిలువల్లాగున్నారు. ఇద్దరు పోలీసులు మాత్రం అప్పుడే హాస్పిటల్ నుంచి తప్పించుకొనివొచ్చిన రోగుల్లాగున్నారు. కర్రముక్కలకు కాకీ దుస్తులు వేసినట్లున్నారు! లాఠీ బరువునే మోయలేనంత సన్నగా వున్నారు!

వాళ్లు ఐదుగురు ఇంకెలా వున్నారు? దొరల్లా వున్నారు - దొరల బొమ్మరుదుల్లా వున్నారు - మంత్రుల బంధువుల్లా వున్నారు.

ఆ పోలీసలు మాత్రం దొరల జీతగాళ్లలా వున్నారు.

వాళ్ళు ఐదుగురు రక్తం తాగి తాగి వూరినట్లున్నారు.

ఆ ఇద్దరు పోలీసులు రక్తం కక్కుకొని సన్నబడిన దీర్ఘ రోగుల్లా వున్నారు!

వాళ్లేనా పొగరుబోతు పోతరాజుల్నుంచి జనాన్ని రక్షించేది??

శేరాలు హోటల్ దగ్గర పోలీసులున్నారని తెలిసి పోతరాజు రంకెలు వేశాడు -

'నా ఇలాకలకు పోలీసులొచ్చిండ్లా! ఎన్ని గుండెలుండాలెరా...' అని వురుములు వురిమి శేరాలు హోటల్ ముందు వాలాడు. వెంట నలుగురు కండల వాళ్లున్నారు.

చాకు తీసి "నన్ను పట్టుకపోతారా...ఏదీ పట్టుకపోండ్లి బే..." అని బెదిరించాడు పోతరాజు.

ఉడుకుడుకు 'చా' తాగుతున్న ఇద్దరు పోలీసులు ద్విపంచప్రాణాలు పోయాయి. ఊదుకుంటూ తాగే ఉడుకుడుకు 'చా' దుస్తుల మీద వొలికిపోయింది.

ఊరిని రక్షించడానికి వొచ్చినట్టు అప్పటిదాకా పెట్టిన ఫోజులు, భరోసాలు... పోతరాజును, పోతరాజు బంట్లను చూడగానే ఎగిరిపోయి... ఆత్మరక్షణ కోసం ఆ పోలీసులు చా కప్పుల్ని పడేసి పరుగో పరుగు...!

వెంటపడి తరుముతున్నారు పోతరాజు, అతని గ్యాంగ్!

పోలీసుల మొహాల్లో భయం...గూండాల మొహాల్లో వికట్టహాసం...!

పోలీసుల్ని గూండాలు తరిమే ఆ దృశ్యాన్ని చోద్యంగా చూసేవాళ్లు కొందరైతే... భయపడి తలుపులు బిగించుకునే వాళ్ళు కొందరు!

పోలీసులు తమకు భయపడి పారిపోతుంటే పోతరాజుకు పట్టరాని ఆనందంగా వుంది...పక పక నవ్వుతుంటే పక్షులు జడుసుకొని కానరాని దూరాలకు పారిపోతున్నాయి... ఎగిరిపోతున్నాయి!!

"నా ఇలాకల అడుగుపెడ్తరు బే...మీ కీళ్లు ఇర్సి కుప్ప బెడ్త... ఎవడు అడ్డం వొస్తడో చూస్త, గుండెలుంటె మీ అమీన్నే రమ్మనుండ్లి బే"

ఉరుముతూ పోలీసుల వెంటపడ్డాడు. పోతరాజు- బతుకుజీవుడా అని శక్తి కొద్దీ పరుగెత్తుతున్నారు ఆ ఇద్దరు పోలీసులు.

లాఠీలు ఎక్కడో జారిపోయాయి. గుండెలు జారిపోతున్నాయి. ఒళ్లంతా చెమటతో తడిసి చల్లబడింది. గొంతు తడారిపోతున్నది. కళ్లకు బైర్లు కమ్ముతున్నాయి.

ఏ ఇంట్లో నన్నా దాక్కుందామంటే భయంతో తలుపులు వేసుకునే వాళ్లే - సందులు, గొందులు దాటి పరుగెత్తుతున్నారు పోలీసులు.

పట్టువదలక వెంటబడ్డారు పోతరాజు గూండాలు.

కోడిపిల్లల్ని గద్దలు తరుముతున్నాయి, నిస్సహాయతను గూండాయిజం తరుముతోంది.

పోతరాజు చేతిలోచాకు దగదగా మెరుస్తోంది. దాహం దాహం అని అరుస్తోంది.

పారిపోతున్న పోలీసుల్ని చూసి పోతరాజు మీసం మెలివేశాడు. పట్టుకొని డొక్కలో పొడవందే వొదలనని వెంటపడ్డాడు.

తలదాచుకునే ఆశ్రయం లేక ప్రాణాలపై ఆశ వొదులుకుని పరుగెడుతున్నారు పోలీసులు.

అడ్డదారిలో ఇద్దరు గూండాలు ఎదురుగా వచ్చి ఢీ కొన్నారు. పోలీసులు కింద పడిపోయారు. భయంతో వణికి పోతూ...పక్షుల్లాగిలగిల్లాడుతూ... తమనేం చెయ్యొద్దని రెండు చేతులు జోడించి వేడుకున్నారు.

వారి బేల చూపులు, దీనాలాపనలు, వేడుకోళ్లు గూండాలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి... క్షణంలో వాళ్లు పోతరాజు చాకు వాత పడేవాళ్లే...

"ఆగుండ్లిరా..."

ఒకసారిగా ఉరుములాంటి...పిడుగులాంటి...సింహగర్జన లాంటి మాటలు వినిపించాయి.

"ఆళ్ల మీద చెయ్యి ఏసిండ్లో మిమ్ముల నరికి పోగులుపెడ్తం..." చేతిలోని గొడ్డలితో ముందుకు వచ్చాడు వీరస్వామి...అతని వెంట పది మంది దాకా జనం వున్నారు - వారి చేతుల్లో గొడ్డళ్లు, గుతుప కట్టెలున్నాయి.

ఊహించని ఆ పరిణామానికి ఖంగుతిన్నాడు పోతరాజు...!

అతనివెంటనున్న గూండాలు బెదిరిపోయారు -

వీరస్వామి వీరావేశం చూసి... వీరస్వామి వెంటనున్న జనాన్ని చూసి...

మిగతా జనానికి ధైర్యం వచ్చింది. మూసుకున్న తలుపులు తెరుచుకున్నాయి... వొణుకుతున్న చేతులు అందిన కట్టెను, కొడవలిని, గొడ్డళ్ళను అందుకున్నాయి... ఆడవాళ్ళూ ముందుకొచ్చారు.

పోతరాజు పొగరు అణచాలని అందరికీ వుంది. ఊరును రక్షించుకోవాలనీ వుంది. కాని పిల్లి మెడలో గంట కట్టే మొనగాడు ఇన్నాళ్ళు కనిపించలేదు. ఇప్పుడు వీరస్వామి తెగింపును చూసి జనానికి తెగింపు వచ్చింది. కాళ్లకు సత్తువ వచ్చింది. చేతులకు సత్తువ వచ్చింది.గుండెలకు సత్తువ వచ్చింది. గొంతులకు సత్తువ వచ్చింది - జనానికి శక్తి వచ్చింది.

వీరస్వామి సింహగర్జనతో జనశక్తి మేల్కొన్నది.

"మర్యాదగా తోక ముడిసి పోతరా... ఏ కీలు కా కీలు ఇరిసేయమా..." మీది మీదికి వచ్చిన వీరాస్వామిని... అతని వెంట వున్న జనాన్ని చూసి బిత్తరపోయాడు పోతరాజు.

అదిరిపోయాడు పోతరాజు.

అదిరిపోయారు పోతరాజు బంట్లు.

పోతరాజు కళ్లు గిర్రున తిరిగి పోయాయి. కళలో కూడా వూహించని పరిణామం అది.....

తనంటే... తన అనుచరులంటే గజగజ వొణికిపోయే జనం... ఇలా ఏకమై తమ మీద విరుచుక పడతారని పోతరాజు అనుకోలేదు. పోతరాజులు అనుకోలేరు. అనుకుంటే అలా ఆగడాలకు పూనుకోరు.

పోతరాజు మీసాలు... వికట్టాహాసాలు జనాన్ని కలవర పెట్టలేదు. కంపరం పుట్టించలేదు.

పోతరాజు కళ్లనిషా దిగిపోయింది. పోతరాజులోని పశువు బెదిరిపోయింది. పోతరాజులోని గూండా వొణికి పోయాడు.

తనను జనం ముక్కల కింద నరికేది ఖాయం అని తెలుసుకొని... పోతరాజు కాలికి బుద్ధి చెప్పాడు - అసురగణం అనుసరించింది.

ఊరి పొలిమేర దాటే దాకా జనం వెంట పడి వారిని తరిమేశారు.

ఆ రోజు నుంచి ఆ ఊరే కాదు... మరే ఊరి మీద పోతరాజు నీడ పడిన జాడలు లేవు - పడితే పోతరాజుకు తగినశాస్తి చేయడానికి సిద్ధంగా వున్నారు జనం.

*ప్రజాపక్షం పక్షపత్రిక, 1 మార్చి 1992*